

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి : ఎస్పి

వీరవాసరం:ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్పి రవిప్రకాష్ అన్నారు. హెల్మెట్ వినియోగంపై ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలను నడుపుతున్న వారికి ఎస్పి గులాబీలిచ్చి అభినందించారు. హెల్మెట్ పెట్టుకోని వారికి ప్రమాదాల్లో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సిఐ నాగప్రసాద్ పాల్గొన్నారు.


వాహనదారులకు పువ్వు ఇచ్చి అభినందిస్తున్న ఎస్పి రవిప్రకాష్

బదిలీలు జరిగేనా..!

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో విస్తృత చర్చ

ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో ఏడు వేల మందికిపైగా ఉద్యోగులు

60 శాతానికిపైగా ఉద్యోగులు బదిలీ కోసం ఎదురుచూపులు

ఏప్రిల్‌లో బదిలీలంటూ పెద్దఎత్తున ప్రచారం

ప్రభుత్వం నుంచి కదలిక లేకపోవడంతో ఉద్యోగుల్లో నిర్వేదం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బదిలీల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. దూరప్రాంతాల వారంతా తమ సొంత ప్రాంతాలకు వెళ్లాలని తహతహలాడుతున్నారు. ముఖ్యంగా వేరే జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులు కుటుంబపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019 అక్టోబర్ రెండో తేదీన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బాధ్యతలు చేపట్టారు. మూడున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించి బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. 2021 అక్టోబర్‌కు సచివాలయ ఉద్యోగులకు రెండేళ్లు పూర్తయినా రెగ్యులర్ చేయకుండా తొమ్మిది నెలలు ఆలస్యంగా 2022 జులైలో రెగ్యులర్ చేసిన పరిస్థితి ఉంది. దీంతో ఉద్యోగులంతా తొమ్మిది నెలల సర్వీసు కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. రెగ్యులర్ చేయడంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వం బదిలీల విషయంలోనూ కాలయాపన చేస్తుందనే విమర్శలు ఉద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. నియామకాల సమయంలో తమ సొంత ప్రాంతాలకు 50 కిలోమీటర్ల అంతకు మించి ఎక్కువ దూరంలో పోస్టింగులు వచ్చాయి. బదిలీలు జరిగేటప్పుడు తమ ప్రాంతాలకు వెళ్లొచ్చనే ఆలోచనతో ఉద్యోగాల్లో చేరిపోయారు. తూర్పుగోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాలకు చెందిన ఉద్యోగులు కూడా జిల్లాలో పని చేస్తున్నారు. కుటుంబం ఒకచోట, ఉద్యోగం మరోచోట అన్నట్లు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. జిల్లాలో 938 గ్రామ సచివాలయాలు, 207 వార్డు సచివాలయాలు మొత్తం 1,165 ఉన్నాయి. వీటిలో దాదాపు ఏడు వేల మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో 60 శాతం మందికిపైగా సచివాలయ ఉద్యోగులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. బదిలీల్లో తాము కోరుకున్న స్థానానికి వెళ్లొచ్చని, కుటుంబంతో ఉండొచ్చని ఆశపడుతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం బదిలీలపై ఎటువంటి కదలికా లేకుండాపోయింది. కొద్దిరోజుల క్రితం సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ మంత్రులతో బదిలీలపై మాట్లాడామని, ఏప్రిల్‌లో ఉండొచ్చని ప్రకటించారు. ఏప్రిల్ రావడంతో సచివాలయ ఉద్యోగుల్లో బదిలీలపై చర్చ పెద్దఎత్తున సాగుతోంది. బదిలీల ప్రక్రియ ఎప్పుడు చేపడతారని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు బదిలీలు చేయకపోతే ఎన్నికల దగ్గర పడుతుండటంతో ఇక చేపట్టే పరిస్థితి ఉండదనే ఆందోళన అందరినీ వెంటాడుతోంది. బదిలీలు చేపట్టాలంటూ సచివాలయ ఉద్యోగులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



సచివాలయ ఉద్యోగుల్లో ప్రభుత్వంపై అసంతృప్తి

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తమ మానస పుత్రికగా వైసిపి ప్రభుత్వం పదేపదే చెబుతోంది. వచ్చే ఎన్నికల్లో సచివాలయ ఉద్యోగులు వైసిపికి అండగా ఉంటారని భావిస్తోంది. అయితే ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ప్రభుత్వంపై సచివాలయ ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోంది. సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంలో తొమ్మిది నెలలు ఆలస్యం చేయడంతో అన్ని నెలల సర్వీసు, పే స్కేల్‌లో వచ్చే పెంపు జీతం కోల్పోయామనే భావన ఉద్యోగుల్లో నెలకొంది. అంతేకాకుండా స్థానికంగా ఉన్న వైసిపి నాయకులు సచివాలయ ఉద్యోగులపై పెత్తనం చేస్తున్న తీరుతో వారంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ముఖ్యంగా సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులను బందోబస్తు పేరుతో పోలీసు అధికారులు పెడుతున్న ఇబ్బందులు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రభుత్వం బదిలీల ప్రక్రియపై మౌనం వహించడం, సమస్యలు అపరిష్కృతంగా ఉండటంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోయినట్లు తెలుస్తోంది.


అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ, ధర్నా, మాట్లాడుతున్న నాయకులు

ఎపి సీడ్స్‌లో టెండర్ విధానం రద్దు కోరుతూ ర్యాలీ

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎపి సీడ్స్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన టెండర్ విధానం రద్దు చేయాలని అఖిలపక్షం ముక్తకంఠంతో అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక రామభద్ర కాంప్లెక్స్ నుండి వెంకటేశ్వర థియేటర్ సెంటర్ మీదుగా నరేంద్ర సెంటర్ వరకు హమాలీలు ర్యాలీ నిర్వహించారు. ఎపి సీడ్స్‌లో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఆపాలని, పాత పద్ధతిలో అగ్రిమెంట్ చేయాలని పెద్దఎత్తున నినదించారు. అనంతరం నరేంద్ర సెంటర్‌లో తెలుగునాడు కార్మిక సంఘం నేత రెడ్డి రామకృష్ణ, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి దిర్శిపో రామకృష్ణ, జనసేన నాయకులు అనుకుల రమేష్, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పౌరహక్కుల నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వి.ప్రతాప్, సిఐటియు నాయకులు ఎ.అజయకుమారి, పట్టణ కార్యదర్శి గుబ్బల గోపీ మాట్లాడారు. ఎపి సీడ్స్‌లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న హమాలీలను తొలగించడం చట్ట విరుద్ధం, అన్యాయమన్నారు. చట్టాలు అమలు చేయాల్సినవారే వాటిని పక్కన పెట్టడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో 18 యూనిట్లు ఉంటే అందులో ఎక్కడా లేని టెండర్ విధానం తణుకులో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, రమణ, బాలాజీ, సూరిబాబు, వరలక్ష్మి, రూతమ్మ, నిమ్మకాయల లక్ష్మి, నాగమణి, పి.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదేశించినా తగ్గని ధరలు

వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య

ప్రజాశక్తి - ఆకివీడు

సామాన్య ప్రజానీకం అత్యంత ప్రాణాపాయ సమయంలో వినియోగించే మందుల ధరల తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా మార్కెట్లో ధరలు మాత్రం తగ్గడం లేదని వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 840 అత్యవసర మందుల జాబితాలో 651 మందుల ధరలను ఏడు శాతం ప్రభుత్వం తగ్గించిందని చెప్పారు. అయినప్పటికీ వ్యాపారులు మాత్రం ధర తగ్గించడం లేదన్నారు. సంబంధిత అధికారులు షాపులను తనిఖీ చేసి కొత్త ధర అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి దుకాణం వద్ద పాత, కొత్త ధరలను విడివిడిగా సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయించాలని కోరారు. మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, దారుణమైన నొప్పి, పక్షవాతం, కాలేయం సమస్యలు వంటి వాటికి వినియోగించే మందులు ఈ అత్యవసర జాబితాలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో నకిలీ మందులు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని తనకు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేకంగా అతి తక్కువ ధరకు అందజేసే జనరిక్ మందులు సైతం సాధారణ మందుల షాపుల్లో సాధారణ ధరలకు విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మోసాలను నివారించేలా అధికారుల తనిఖీలు పెరగాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి మందుల ధరలు తగ్గి జనానికి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, తనిఖీ అధికారుల, జెసితో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ నిర్వీర్యం తగదు

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - తణుకు రూరల్

దేశంలో పేదలకు పనులు చూపి పొట్ట నింపే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఇది తగదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. ఉపాధి హామీ పనుల పర్యటనలో భాగంగా శుక్రవారం మండలంలోని యర్రాయిచెర్వు గ్రామంలో తాగునీటి చెరువులో పని చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ లెక్క ప్రకారం పని చేస్తున్నా ప్రభుత్వం ప్రకటించిన రూ.272 కూలి రావడం లేదని, కేవలం రూ.140 నుండి రూ.170 మాత్రమే వస్తుందని తెలిపారు. ఈ మండుటెండలో ఎక్కువ సమయం పని చేయలేక ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నామని, దీంతో కూలీలు ఎక్కువమంది పనిలోకి రావడం లేదని చెప్పారు. పని ప్రదేశానికి కొంతమంది అధికారులు వచ్చినప్పుడు కూలి సొమ్ము బ్యాంక్ ఖాతాలో తక్కువగా పడుతున్నాయని చెబితే సదరు అధికారి మట్టి పని చేసుకునే బతికే వాళ్లు.. మీరు చేసేది కలెక్టర్ ఉద్యోగం కాదు అని చులకనగా మాట్లాడుతున్నారని కూలీలు వీరభద్రరావు వద్ద వాపోయారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ సంపద సృష్టికర్తలైన కూలీలను కించపరుస్తూ సంబంధిత అధికారులు మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. తక్షణం ఈ వైఖరి మార్చుకోవాలని వీరభద్రరావు అధికారులకు సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పనులు రెండో పూట రద్దు చేయాలని, కూలి రూ.600 ఇవ్వాలని, అడిగిన ప్రతి కుటుంబానికీ రెండొందల రోజులు పని కల్పించి పేస్లిప్‌లు ఇవ్వాలని, చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలా చినమారయ్య, పాలా దానేశ్వరరావు, పితాని రంగారావు, కడలి ధనలక్ష్మి, వట్టికూటి పద్మావతి, వేండ్ర లక్ష్మి, పితాని ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

పట్టణాభివృద్ధికి సమన్వయంతో కృషి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణాభివృద్ధి, సుందరీకరణకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేసి మంచి ఫలితాలు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావుతో ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు పట్టణాభివృద్ధి, సుందరీకరణపై సమావేశం నిర్వహించారు. ప్రసాదరాజు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం నిర్వహణ మెరుగుపరచాలని సూచించారు. ఏఒక్క వార్డులోనూ పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ప్రజలు, కౌన్సిలర్ల నుంచి ఏఒక్క ఫిర్యాదూ రాకూడదని స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి పారిశుధ్య కార్మికుల నియామకాలు చేపట్టాలన్నారు. రహదారుల పక్కన, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల అవరణలో మొక్కలు నాటాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.62 కోట్లు పట్టణంలో ఖర్చు చేయబోతున్నామని, పనులకు టెండర్లు పిలిచామని ఆయన తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు రూ.217 కోట్లు వ్యయం అంచనా వేశామని, మొదటి విడతలో ఒకటి నుంచి తొమ్మిది వార్డులకు రూ.87 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ పనులపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రసాదరాజు ఆదేశించారు.


మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు



ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టండి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజారోగ్యమే ధ్యేయంగా గ్రామాల్లో వైద్య సేవలందిస్తూ ప్రజలకు రక్తహీనత లేకుండా ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా సేవలందించాలని డిఎంహెచ్ఒ మహేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకోడేరు పిహెచ్‌సి వైద్య సిబ్బందితో సమావేశం అనంతరం ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రక్తహీనతతో చాలామంది బాధపడుతున్నారన్నారు. రక్తహీనత లేకుండా ఆరోగ్య సూత్రాలను చెబుతూ పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. మాతృ, శిశుమరణాలు మరణాలు లేకుండా గర్భిణులు, బాలింతలను ఎప్పటికప్పుడు వారిని పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా సిజేరియన్‌లు అవుతున్నాయని, వీటిని నివారించాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపైనే ఉందని తెలిపారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బంది ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రావిచెట్టు సెంటర్లో మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్వర్ణనిరంజని, సిహెచ్ఒ సత్యనారాయణ, పిహెచ్ఎన్ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు శంకర్, శ్రీనివాస్, అమ్మాజీ, ఆరోగ్య సహాయకులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యలమంచిలి తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

యలమంచిలి మండలం చించినాడలో దళితులకు చెందిన లంక భూములను అక్రమంగా లాక్కోవాలని చూస్తున్న అక్కడి తహశీల్దార్‌పై ఎస్‌సి, ఎస్‌టి చట్టప్రకారం కేసు నమోదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం నరసాపురం పట్టణంలో మీరా గ్రంథాలయంలో జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ అధ్యక్షతన జరిగింది. క్రాంతిబాబు మాట్లాడుతూ చించినాడలో లంక భూములను ఏళ్లతరబడి దళితులు అనుభవిస్తున్నారన్నారు. 300 మంది ఎస్‌సి, బిసి కుటుంబాల వారు 60 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. క్రమేనా మెరకభూమి పెరగడంతో మరో 400 మంది ఆ భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. పెత్తందారుల ఆధీనంలో ఉన్న పెరుగు భూములను వదిలేసి కేవలం ఎస్‌సి, ఎస్‌టి, బిసిల వద్ద ఉన్న భూములను లాక్కోవాలని తహశీల్దార్ చూస్తున్నారని ఆరోపించారు. దళితులు, బిసిల భూముల్లో అధికారుల పర్యవేక్షణలో అక్రమంగా, అన్యాయంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారన్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా దళితుల పట్ల యలమంచిలి తహశీల్దార్ వ్యవహరిస్తున్న తీరు అన్యాయమన్నారు. ఈ సమస్యపై తక్షణం జిల్లా కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేశారు. లంక భూముల సమస్యలను పరిష్కరించాలని, అక్రమ తవ్వకాలు ఆపాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో దళిత పేటలకు శ్మశాన వాటికలను కేటాయిస్తున్నామని అధికారులు చేసిన హడావిడి కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ అన్ని మండలాల్లో దళితపేటలకు శ్మశానవాటికలను కేటాయించాలని ఆదేశాలిచ్చినా నేటికీ ఎక్కడా అది అమలు కాలేదన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో గతంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమంతో నాడు రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతి దళితపేటకూ రెండెకరాలను కేటాయించాలని జిఒ నెం.1235 విడుదల చేశారని గుర్తు చేశారు. రాజన్న రాజ్యం తీసుకొస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఈ జిఒ ప్రకారం దళితపేటలకు రెండెకరాల శ్మశాన వాటికను ఎందుకు కేటాయించరని ప్రశ్నించారు. తక్షణం దళితులకు శ్మశానవాటికలు రెండెకరాలు చొప్పున కేటాయించాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు కప్పల రత్నరాజు, మాదాసు గోపి, నేతలు కానేటి బాలరాజు, కింతాడ రమేష్, తనుకుల చంటి, పి.శ్యాంబాబు పాల్గొన్నారు.


సాల్మన్‌రాజు, ప్రకాశరావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ధన్యజీవులు సాల్మన్‌రాజు, ప్రకాశరావు

ప్రజాశక్తి - పోడూరు

బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడి తమ జీవితాన్ని త్యాగం చేసిన ధన్యజీవులు దిగుపాటి సాల్మన్‌రాజు, ప్రకాశరావు అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. వీరి 43వ వర్ధంతి సభ పండితవిల్లూరు స్తూపం వద్ద ముడే మోజేష్ అధ్యక్షతన జరిగింది. తొలుత వారి చిత్రపటాలకు సీనియర్ నాయకులు కడలి సూర్యారావు, కేతా గోపాలన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేతలు బండి రంగారావు ప్రసాద్, కాటూరి యాకోబు, గూటం జోషిక్రాంతికుమార్, మల్లుల రామారావు, మల్లుల కొండమ్మ, మల్లుల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రవాహానికి కర్రనాచు అడ్డంకి

స్వచ్ఛందంగా తొలగించుకున్న రైతులు

ప్రజాశక్తి - వీరవాసరం

తోలేరు తూర్పుకాల్వలో కర్ర నాచు పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పంట భూములకు నీరందని పరిస్థితి ఏర్పడుతోందని తోలేరు రైతులు తెలిపారు. కొన్ని రోజులుగా కర్రనాచు వల్ల కాల్వలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని, సాగునీరందక తమ పంట భూములు ఎండిపోయాయని వివరించారు. దీంతో వారే స్వచ్ఛందంగా ముందుకొచ్చి శుక్రవారం కాల్వలో పేరుకుపోయిన తూడు, కర్రనాచును తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఈ విధంగా కాల్వలో తూడు పెరగలేదన్నారు. ఆక్వా చెరువు నీరు కాల్వలోకి వదిలేయడం వల్ల వేసవిలో కాల్వలు ఆరుదల లేక కర్రనాచు ఏర్పడటానికి కారణమవుతుందన్నారు. తోలేరు, బలుసులగొయ్యిపాలెం, తమ్మినీడివారిపాలెం, వీరవల్లిపాలెం సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టుకు ఈ కాల్వ ద్వారానే సాగు, తాగునీరు అందుతుందని రైతులు తెలిపారు.


తోలేరు కాలువలో నాచు తీస్తున్న రైతులు

గూడెంలో జగనన్నే మా భవిష్యత్తు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జగనన్నే జనం భవిష్యత్తు, నమ్మకం అని ఇంటింటికీ వెళ్లి చాటి చెప్పాలని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకు 15 రోజులపాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తారని చెప్పారు. 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము లేని టిడిపి, జనసేన ఇతర ప్రతిపక్ష పార్టీలు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయన్నారు. అంతిమ విజయం వైసిపిదేనని ధీమా వ్యక్తం చేశారు. తాను ముఖ్యమంత్రిని అవుతానని ప్రకటించుకుని, ఆ దిశగా కృషి చేస్తే పవన్‌కళ్యాణ్‌కు కనీసం ప్రతిపక్ష హోదా అయిన దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, పెంటపాడు ఎంపిపి దాసరి హైమావతి, పట్టణ కన్వీనర్ కులుకులూరి ధర్మరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైకాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



మల్లేశ్వరరావును అభినందిస్తున్న నారా లోకేష్

టిడిపి ఎస్‌టి సెల్ ఇన్‌ఛార్జిగా మల్లేశ్వరరావు

అభినందించిన నారా లోకేష్

ప్రజాశక్తి - పాలకోడేరు

తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కోనసీమ జిల్లాల టిడిపి ఎస్‌టి సెల్ కమిటీ ఇన్‌ఛార్జిగా గొల్లలకోడేరుకు చెందిన సాల మల్లేశ్వరరావును రాష్ట్ర ఎస్‌టి సెల్‌లో కమిటీ ఇన్‌ఛార్జి కొండారెడ్డి నరహరి వరప్రసాద్ నారా లోకేష్ ఆదేశాల మేరకు ఎంపిక చేశారు. ఈ మేరకు మల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ప్రస్తుతం ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నానని, టిడిపిలో చురుకైన పాత్ర వహించడంతో ఉభయగోదావరి జిల్లాల ఎస్‌టి సెల్ కమిటీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఇప్పటికే జిల్లా ఎస్‌టి సెల్ కమిటీని ఎంపిక చేశారని, త్వరలో మూడు జిల్లాల కమిటీలను ఏర్పాటు చేసి రెండు జిల్లాల్లో టిడిపి బలోపేతం చేస్తానని మల్లేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో తాను పాదయాత్రలో లోకేష్‌ను కలిశానని ఆయన అభినందించారని తెలిపారు. ఇన్‌ఛార్జి పదవి రావటంలో ఉండి ఎంఎల్‌ఎ రామరాజుతోపాటు జిల్లా, మండల నాయకులు సహకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు మల్లేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆరోగ్యమే మహాభాగ్యమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు జివి.సుబ్బారావు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆరోగ్యమే మహాభాగ్యం గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వయస్సుల వారికీ ఆరోగ్యం ముఖ్యం అన్నారు. ఆరోగ్యం కాపాడుకోవాలంటే మంచి ఆహారం తినాలని, వ్యాయామం చేయాలని తెలిపారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపరాదని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాపాక ప్రభాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ నవ్య జీవన్, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆరోగ్య వంతమైన జీవనాన్ని గడుపుతారని తెలిపారు. కార్యక్రమంలో గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, పి.ఎలిజిబెత్, ఎస్‌కె.అమలేశ్వరరావు, వై.నారాయణమూర్తి పాల్గొన్నారు.



ఆసుపత్రి సిబ్బందికి కుర్చీలు అందజేస్తున్న చిట్టూరి సుజాత

ఆసుపత్రికి కుర్చీలు అందజేత

ప్రజాశక్తి - తణుకురూరల్

చిట్టూరి అచ్యుత రామప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం భార్య చిట్టూరి సుజాత రోగుల ఉపయోగార్థం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి కుర్చీలు అందజేయడం అభినందనీయమని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్టూరి సుజాత 20 కుర్చీలను బహూకరించారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రోగుల పట్ల దాతృత్వం కలిగి, ఆసుపత్రికి సహకరిస్తున్న సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఛైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తమ వంతు సహాయం చేస్తూ ముందుకు సాగుతున్న చిట్టూరి సుజాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు, తలపాకు అఖిల్, ఎలిషా, పసల నాని, సందీప్, వెంకటరత్నం, లక్ష్మణరావు, సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

పేదవాడి సొంతింటి కల కలేనా అని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. సిపిఎం బృందం మండలంలోని పలు గ్రామాల్లో సందర్శించింది. ఈ సందర్భంగా లబ్ధిదారులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రుణాలు ఇంటి కట్టుబడి బేస్‌మెంటు రూఫ్ లెవెల్ వరకూ కట్టుకున్నామన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి తప్ప ఇళ్ల నిర్మాణం పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీలు 50 శాతం ఇళ్లు నిర్మాణం మధ్యలో నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడికీ ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముడే మోజేష్, బొంతు శ్రీను, కౌరు శ్రీను, రాపాక వెంకటేశ్వరరావు, అధికారి గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ యంత్రాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతులంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అపార ప్రేమ అని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన సమయంలో నెలలోపు రైతులను ఆదుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. శుక్రవారం వీరవాసరం మండలానికి సంబంధించి రైతులకు సబ్సిడీపై మంజూరైన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఎంఎల్‌ఎ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా రైతులకు సబ్సిడీపై రూ.25 లక్షల విలువ చేసే వరి కోత యంత్రం, నాలుగు మహీంద్ర 575 పెద్ద ట్రాక్టర్లు, రూ.28 లక్షలు విలువ చేసే 14 పవర్ టిల్లర్లు, 10 స్ప్రేయర్ బ్యాటరీలు, రెండు స్ట్రోక్ పవర్ స్ప్రేయర్ పనిముట్లు రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, వీరవాసరం మండల వ్యవసాయ శాఖ అడ్వైయిజరీ బోర్డ్ కమిటీ ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఎడి నారాయణరావు పాల్గొన్నారు.




ట్రాక్టర్ ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

నత్తనడకన ఆసుపత్రి నిర్మాణ పనులు..!

నిధుల విడుదలలో జాప్యం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వాసుపత్రి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2020 నవంబర్ 20న ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేసింది. రూ.12.5 కోట్లతో 50 పడకల ప్రభుత్వాసుపత్రిని వంద పడకల చేసే ఉద్దేశంతో అప్పటి వైద్య ఆరోగ్య శాఖా మంత్రి ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనికితోడు ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అంతంత మాత్రంగానే సేవలందుతున్నాయి. 1966లో నిర్మించిన ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. అన్ని విభాగాలకు చెందిన వైద్యులూ ఉన్నప్పటికీ వైద్య పరికరాల్లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వాసుపత్రి సేవలను రోగులు ఎక్కువగా వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలు లేకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. ఈ ఆసుపత్రికి వివిధ మండలాలు, గ్రామాల నుంచి రోజూ అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. రెండేళ్లుగా ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో ఆసుపత్రిలో సేవలు తగ్గాయి. ఆసుపత్రిలో సరైన వైద్య పరికరాలు లేకపోవడంతో ప్రజలు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ఆధునిక పరికరాలు వస్తాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నత్తనడకగా సాగుతున్నాయి. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ జోక్యం చేసుకుని ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి వద్ద నత్తనడకన జరుగుతున్న విస్తరణ పనులు

అభివృద్ధికే వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యతిస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం పెదఅమిరంలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక టిడిపి, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ప్రజల వద్దకు పాలన అందించేందుకు సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పెదఅమిరంలో ఇంటింటికీ తిరుగుతూ డోర్‌కు పోస్టర్, మొబైల్‌పై స్టిక్కర్ అతికిస్తూ ప్రజా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కాళ్ల, ఉండి, ఆకివీడు జెడ్‌పిటిసిలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, రణస్థల కనకదుర్గ మహంకాళి, ఎంపిపిలు భూపతిరాజు చంటిరాజు, ఇందుకూరి హరిబాబు, కటారి జయలక్ష్మి, ఆకివీడు మున్సిపల్ ఛైర్ పర్సన్ జామి హైమావతి, పెదఅమిరం గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు పాల్గొన్నారు.



పెదఅమిరంలో ప్రచారం నిర్వహిస్తున్న పివిఎల్ నరసింహరాజు

ఆచంట : వైసిపి నుంచి నేరుగా ప్రజలతో మమేకమయ్యే బృహుత్తర కార్యక్రమమే 'జగనన్నే మా భవిష్యత్' మా నమ్మకం నువ్వే జగన్ అని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, పెనుమంచిలి, భీమలాపురం, ఆచంట వేమవరం, కందరవల్లి, శేషమ్మచెరువు, అయోధ్యలంక గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్' మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్పంచులు, నాయకులు వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులతో గడపగడపకూ వెళ్లారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి స్టిక్కర్లను వారి అనుమతితో తలుపులకు అతికించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించి, 82960 82960కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. జగనన్న పాలనలో పేదల ఎదుగుదలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఈ కార్యక్రమం ద్వారా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గణేశుల శేషవాణి సుబ్బారావు, జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని ఆగర్రు, ఆగర్తిపాలెం, వాలమర్రు, సగంచెరువు తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లతోపాటు వైస్ ఎంపిపి సునీల్, అగర్తిపాలెం ఉప సర్పంచి కడల శ్రీనివాస్, సగం చెరువు సర్పంచి కడలి నాగమణి, వాలమర్రు సర్పంచి గంటా సత్యనారాయణ, ఆగరు సర్పంచి నాగరత్నం పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను అమలు చేయడంతో పాటు, జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మెంటేవారితోటలో ఎంఎల్‌ఎ జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికీ వెళ్లారు. ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలు సైతం అమలు చేసి ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి చెరగని ముద్రను వేసుకున్నారన్నారు. వాలంటీర్ల, సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి పరిపాలనను ఇంటి ముంగిటకు తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య పాల్గొన్నారు.

పెనుమంట్ర : శుక్రవారం పొలమూరులో చెన్నాడచెరువు, నాగలదిబ్బ ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రచార కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పథకాల లబ్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రుడా ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, ఎఎంసి వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచి కాకర రాజేశ్వరరావు పాల్గొన్నారు.



పెనుమంట్ర: ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

ఆకివీడు : జగనన్న వల్లే అందరికీ మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సాలిపేటలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పార్టీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఛైర్ పర్సన్ జామి హైమావతి, మోటుపల్లి గంగాధరరావు, అంబటి రమేష్, మనే లలితాదేవి, మోరా జ్యోతి పాల్గొన్నారు.

పాలకోడేరు : మండలంలోని వేంద్ర, వేంద్ర అగ్రహారం గ్రామాల్లో నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో జరిగిన మంచి, పథకాల అమలు తదితర అంశాలతో ఐదు ప్రశ్నలకు ప్రజల నుంచి అభిప్రాయాలను తెలుసుకుని ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకంలో నమోదు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంపిటిసిలు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉండి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే భావితరాలకు భవిష్యత్తు అని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, వైసిపి జిల్లా కార్యదర్శి మునుకోలు సింహాచలం అన్నారు. ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, వాలంటీర్లతో కలిసి వైసిపి నాయకులు పెద్ద ఎత్తున ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, వైసిపి జిల్లా కార్యదర్శి మునుకోలు సింహాచలం మాట్లాడారు. కరోనా సమయంలో కూడా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని నిలుపుదల చేయకుండా సమయానికి సంక్షేమ పథకాలను అందించి రాష్ట్ర ప్రజలను ఆదుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్ కరిమెరక రామచంద్రరావు, మండల ఉపాధ్యక్షులు గెద్దా భోగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిర నిర్మాణం చేపట్టొద్దని ఆందోళన

చెరుకువాడలో పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఉండి

చెరుకువాడలో కొంతకాలం నుంచి గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానికులు ఇటీవల స్పందనలో తహశీల్దార్ మల్లెపు రవీంద్ర కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహించిన చెరుకువాడ నూతిగట్టు ప్రాంత ప్రజలు చర్చి నిర్మాణాన్ని అడ్డుకుంటూ గ్రామ ఉపసర్పంచి నడింపల్లి వెంకటరాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి చెరుకువాడ మెయిన్ రోడ్డుపై ఆందోళన చేపట్టి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి సంఘటన స్థలానికి రెవెన్యూ అధికారులను, ఆకివీడు రూరల్ సిఐ గీత రామకృష్ణను చెరుకువాడ గ్రామానికి వెళ్లి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కారం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సంఘటన స్థలానికి ఉండి డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ఆంజనేయులు, గ్రామ రెవెన్యూ అధికారి సైదాడ చిన్నారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ, ఆకివీడు రూరల్ సిఐ గీతా రామకృష్ణ, ఎస్ఐ గంగాధర్‌రావు ఆందోళనకారులతో చర్చించారు. హిందువుల నివాసాల మధ్య చర్చి ఏ విధంగా నిర్మిస్తారని అధికారులను ఆందోళనకారులు ప్రశ్నించారు. చర్చి నిర్మాణానికి తహశీల్దార్ అండగా ఉన్నట్లు చర్చి నిర్వాహకులు చెబుతున్నారని ఆందోళనకారులు అధికారులకు తెలిపారు. రెండేళ్ల క్రితమే ఈ చర్చి నిర్మాణాన్ని అడ్డుకొని అప్పటి తహశీల్దార్ కృష్ణజ్యోతికి ఫిర్యాదు చేయగా అనుమతులు లేకుండా చర్చి నిర్మాణాన్ని చేపట్టరాదని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కొంతకాలం నుంచి చర్చి నిర్మాణాన్ని పున్హ ప్రారంభించగా వెంటనే తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము ఆందోళన చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆకివీడు రూరల్ సిఐ గీతా రామకృష్ణ, డిటి వీరాస్వామి నాయుడు చర్చి నిర్వాహకులతో మాట్లాడి అనుమతులు లేకుండా చర్చిని నిర్మించరాదని, చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఆందోళనకారులు ఆందోళనను విరమించారు.

అసాంఘిక కార్యకలాపాల అడ్డా.. చించినాడ బ్రిడ్జి..!

రాత్రి అయితే చాలు రెచ్చిపోతున్న మందుబాబులు
ఖాళీ సీసాలతో చిందరవందరగా పుష్కర ఘాట్ ప్రాంతం
పట్టించుకోని అధికార యంత్రాంగం



చించినాడ బ్రిడ్జి

ప్రజాశక్తి - యలమంచిలి

అదో అద్భుత పర్యటక ప్రాంతం.. గోదావరి నదిపై సుందరంగా నిర్మించిన బ్రిడ్జిని, దానికింద ఆహ్లాదకరంగా ఉండే పుష్కర ఘాటు ప్రాంతాన్ని చూసేందుకు ఇతర ప్రాంతాల నుండి నిత్యం వందలాది వస్తుంటారు. ఈ పర్యాటక ప్రాంతం తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. అదే మండలంలోని చించినాడ గ్రామం. ఇంతటి ప్రాముఖ్యత గల ప్రాంతం రాత్రి అయితే చాలు బ్రిడ్జిపైన, కింద మందుబాబులతో నిండిపోతుంది. ఎక్కడెక్కడో నుంచో మందుబాబులు ఈ ప్రాంతానికి వచ్చి అర్ధరాత్రి వరకూ ఇష్టానుసారంగా మందు తాగి ఖాళీ సీసాలను చిందరవందరగా పడేస్తున్నారు. మరికొస్త మందు ఎక్కువైతే సీసాలను పగలగొట్టి గోదావరిలోకి విసిరేస్తున్నారు. ఒకప్పుడు చూడటానికి ఎంతో అహ్లాదకరంగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు కళాహీనంగా మారింది. దీంతో చాలా మంది మనసు ప్రశాంతత కోసం బ్రిడ్జి కింద కాసేపు కూర్చొని గోదావరి పరవళ్లను, చల్లటి పిల్లగాలులను, ప్రకృతి అందాలను తనివి తీరా వీక్షించి ఆస్వాదించడానికి ఇక్కడికి వచ్చే పర్యాటకులకు ఈ ప్రాంతం ప్రస్తుతం అసౌకర్యంగా మారింది. బహిరంగ ప్రదేశాలలో మద్యాన్ని సేవించకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా మందుబాబులు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించి ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలను నిలువరించే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.



బ్రిడ్జి కింద ఖాళీ మందు సీసాలు

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని ఏలూరు విజిలెన్స్ సిఐ శివరామకృష్ణ అన్నారు. వీరవాసరం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు గురువారం అర్ధరాత్రి బ్రాహ్మణచెరువు గుండా వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిఐ శివరామకృష్ణ మాట్లాడుతూ రూ.72 వేల విలువచేసే 72 బస్తాల బియ్యాన్ని, రూ.6 లక్షల విలువ చేసే వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. బియ్యాన్ని పెనుమంట్ర సివిల్ సప్లై గోడౌకు తరలించామని తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ఐ బి.పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వర్లు, విఆర్ఒ నాగబాబు ఉన్నారు.

పాలకొల్లులో అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు యడ్లబజార్ సెంటర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అన్న సమారాధన కార్యక్రమం భారీగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరులోని కుక్కలవారితోటలో ఉన్న రామాలయం వద్ద శుక్రవారం రాత్రి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇటీవల శ్రీరామనామ ఉత్సవాలను ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - గణపవరం

వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 7 నుండి 20వ తేదీ వరకూ జగనన్నే భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించి కోటీ 60 లక్షల కుటుంబాలను కలుస్తామని శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వెళ్లి క్షేత్రస్థాయిలో పని చేస్తారన్నారు. ప్రభుత్వంపై విశ్వాసం ఉంటే మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో వైసిపి నియోజకవర్గంలో మండల కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, మరడా రంగారావు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు

ఘనంగా గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి - ఆచంట

మానవాళి శ్రేయస్సు కోసం యేసు క్రీస్తు జన్మించారని పాస్టర్ గాదిరాజు తిమోతిరాజు అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉపవాసాలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మొగల్తూరు : క్రీస్తు సందేశాన్ని అనుసరించాలని రెవరెండ్ ఫాదర్ అయినపర్తి పీటర్ అన్నారు. క్రైస్తవ సోదరులు 40 రోజులుగా నిర్వహించిన ఉపవాస దీక్షలు గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ఫాదర్ పీటర్ ఆధ్వర్యంలో విరమించారు. మొగల్తూరులోని ఆర్‌సిఎం చర్చ్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు శిలువ మోస్తూ ప్రధాన కూడల్లో ప్రదర్శన చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమాలలో సిస్టర్ లిల్లీ, మొగల్తూరు, వెంప, కొప్పారు, పీతలవాని గురువు, మత్స్యపురి, నక్కవారిపాలెం సంఘస్తులు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని వాడవాడలా గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ బాబు రాజేంద్రప్రసాద్ సందేశం ఇచ్చారు. అనంతరం ఆర్‌సిఎం క్రీస్తు సోదరులు మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు.

పాలకొల్లు రూరల్ ఎస్ఐగా ఎస్.శ్రీనివాస్

పాలకొల్లు రూరల్: పాలకొల్లు రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్ తణుకు బదిలీ అయ్యారు. భీమవరం స్పెషల్ బ్రాంచిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సరిదే శ్రీనివాస్ పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీలు జరిగాయి.

బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేస్తా

మోగళ్ల వెంకట రమణారావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం బార్ అసోసియేషన్ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన అధ్యక్షులు మోగళ్ల వెంకట రమణారావు తెలిపారు. శుక్రవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో రమణారావుకు మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు స్వాగతం పలికారు. క్లబ్ మెంబర్ సన్నిధి గుప్తా, మావుళ్లమ్మ దేవస్థానం మాజీ అధ్యక్షులు కారుమూరి సత్యనారాయణ ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ అందరి కృషి వల్లే తాను గెలిచానని, తన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బొండాడ సుబ్బారావు, ఓలేటి శ్రీనివాస్‌గుప్తా, భట్టిప్రోలు శ్రీనివాసరావు, గుండు కిషోర్, విఎస్‌కె కాలేజీ అధ్యక్షులు కోట్ల ప్రసాద్, డిఎన్ఆర్ కాలేజీ కోశాధికారి కొత్త శ్రీనివాస్, గుండు సుమూర్తి, గాడే నాగేశ్వరావు, కనగర్ల రామకృష్ణ, విఆర్ఎల్.బంగారాజు, గుండు సుధీర్, కురిశెట్టి శ్రీనివాస అప్పారావు, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.